క్లుప్తంగా

ఆకివీడు కమిషనర్‌గా కృష్ణమోహన్ బాధ్యతల స్వీకరణ


కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన కృష్ణమోహన్

ఆకివీడు: స్థానిక నగర పంచాయతీ కమిషనర్‌గా జీ.కృష్ణమోహన్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆ శాఖ కమిషనరేట్ నుంచి బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకూ ఏలూరు నుంచి డిప్యూటేషన్‌పై కమిషనర్‌గా తిరుమలరావు పనిచేశారు. ఆయన బాధ్యతల్ని కృష్ణమోహన్‌కు అప్పగించారు. నగర పంచాయతీ సిబ్బంది ఘనంగా స్వాగతించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఆకివీడు అభివృద్ధికి అందరూ కలిసి పనిచేద్దామన్నారు. అందరి సహకారంతో ముందుకు వెళ్లాతామన్నారు.

వైభవోపేతంగా వరదరాజస్వామి కల్యాణం


దుంపగడప గ్రామంలో వరద రాజస్వామి కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

ఆకివీడు: దక్షిణ భారత దేశంలోనే అరుదైన దేవాలయం భూదేవీ సమేత వరద రాజస్వామి వారి ఆలయంలో శనివారం వార్షిక కల్యాణోత్సవం వైభవోపేతంగా జరిగింది. కల్యాణోత్సవంలో ఆలయ చైర్మన్ రామిశెట్టి సూరిబాబు దంపతులతో పాటు పలువురు దంపతులు పాల్గొన్నారు. కల్యాణాన్ని తిలకించేందుకు గ్రామంలోని పలువురు మహిళలు పాల్గొన్నారు. శాస్త్రోక్తంగా కల్యాణం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ముద్దే విశ్వేశ్వరరావు, మాజీ సర్పంచ్ పిన్నమరాజు రంగరాజు, పలువురు స్థానికులు పాల్గొన్నారు. అనంతరం అన్న సమారాధన జరిగింది.

కొట్టి గాయపరిచాడంటూ ఫిర్యాదు

పాలకోడేరు: విస్సాకోడేరు పంచాయతీ పరిధిలోని వంకాయల పాలెం గ్రామానికి చెందిన బండారు వీరన్న అనే కౌలు రైతు వరి పంట కోత కోయిద్దామని కోత మిషన్‌ను మాట్లాడుకున్నాడు. ఆ మిషన్ వెళ్లడానికి గట్టును కూడా బాగు చేయించాడు. శనివారం మధ్యాహ్నం వీరన్న వరిచేలోకి వెళ్లకుండా వేరే పొలంలోకి వెళ్లిపోయింది. దాంతో వీరన్న అడుగుదామని వెళ్లి అతని పొలం గట్టు వద్ద తిట్టుకుంటున్నాడు. మరో గట్టు పక్కన ఉన్న సామన శ్రీనివాస్ అతన్నే తిడుతున్నాడని అనుకొని కొట్టి కింద పడేసి చేతిలో ఉన్న కొడవలితో చేతికి గాయం చేశాడు. దాంతో వీరన్న భీమవరం ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నాడు. ఆసుపత్రి నుంచి వచ్చిన రిపోర్టు ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ టి ధనుంజయ్ తెలిపారు.

మా నమ్మకం నువ్వే జగనన్నకు అపూర్వ స్పందన

ఎమ్మెల్యే శ్రీనివాస్

సాక్షి, భీమవరం: ప్రజలను మరొకసారి మోసగించడానికి మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పన్నుతున్న కుయుక్తులను ప్రజలు గమనిస్తున్నారని ఎట్టి పరిస్థితుల్లోను చంద్రబాబు నాటకాలు సాగవని భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ స్పష్టం చేశారు. శనివారం పట్టణంలోని జీవీఆర్ కల్యాణ మండపంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ప్రజల్లో మా నమ్మకం నువ్వే జగనన్న నినాదం మారుమోగుతుందన్నారు. భీమవరం నియోజకవర్గంలో మానమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమానికి విశేష స్పందన లభించిందని పార్టీ ఆధ్వర్యంలో 88,618 గృహాలను సందర్శించగా 71,411 మిసిడ్ కాల్స్ వచ్చాయని ఇంతపెద్ద మొత్తంలో మెగా సర్వే ఫలితాలు ప్రకటించడానికి గర్వపడుతున్నానన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రతి ఇంటిని సందర్శించి క్షేత్రస్థాయిలో పారదర్శకంగా మెగా సర్వే పోల్ నిర్వహించారన్నారని ఈసందర్భంగా వారిని అభినందిచారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని అందువల్లనే ప్రజల మద్దతే మా బలమని సగర్వంగా చెపుతున్నామన్నారు. రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రి జగన్ చెప్పినట్లు 175 స్థానాల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధించడం వింతేమికాదని శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఏఎంసి చైర్మన్ కోటిపల్లి నాగదుర్గాబాలకేటేశ్వరరావు(బాబు), ఎంపీపీ పేరిచర్ల విజయ నర్సింహరాజు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఏఎస్‌రాజు, జిల్లా మహిళా కన్వీనర్ గూడూరి ఉమాబాల, పట్టణ కన్వీనర్ తోట భోగయ్య, వీరవాసరం మండల కన్వీనర్ గూడూరి ఓంకార్, ఎఎంసి మాజీ చైర్మన్ తిరుమాని ఏడుకొండలు, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ కామన నాగేశ్వరరావు, రజక కార్పొరేషన్ డైరెక్టర్ రేవూరి గోగురాజు,మావుళ్లమ్మదేవస్థానం చైర్మన్ మానేపల్లి నాగేశ్వరరావు, సోమేశ్వర స్వామి దేవస్థానం ట్రస్ట్ చైర్మన్ కోడె విజయలక్ష్మి, పార్టీ జెసిఎస్ కన్వీనర్‌లు గాదిరాజు సుబ్రహ్మణ్యంరాజు(తాతారాజు), నల్లం రాంబాబు, చెల్లబోయిన సూర్య ప్రకాష్, మానుకొండ ప్రదీప్,తిరుమాని గంగా భవాని, కోమటి రాంబాబు, గొలగాని సత్యనారాయణ, గంటా సుందర్ కుమార్, కొల్లి ప్రసాద్, పాలపర్తి జోనా, చిగురుపాటి సందీప్, ముల్లి నర్సింహమూర్తి, గెడ్డం భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.


భీమవరంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్, నాయకులు


పెదఅమిరం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతున్న పీవీఎల్

సీఎం జగన్ పై ప్రజలకు సంపూర్ణ అభిమానం...

కాళ్ల: మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమానికి నియోజకవర్గంలో విశేష స్పందన వచ్చిందని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు తెలిపారు. పెద అమీరం పార్టీ క్యాంపు కార్యాలయంలో శనివారం పార్టీ నాయకులు, కన్వీనర్లు, గృహ సారథులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటికే రాష్ట్రంలో ప్రతి ఇంటికి ప్రభుత్వ పథకాలు చేరువయ్యాయని పథకాలు పట్ల ప్రజలందరూ సంతృప్తిగా ఉన్నారని స్పష్టం చేశారు. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ద్వారా నియోజవర్గంలో ప్రతి ఇంటికి వెళ్లగలిగామని చెప్పారు. నియోజకవర్గంలో 97 వేలు గృహాలు ఉండగా 67 వేల మందితో మిస్డ్ కాల్ ఇవ్వగలిగామని ధీమా వ్యక్తం చేశారు. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ప్రతి ఇంటికి చేరువైందన్నారు. నియోజవర్గంలో 67,000 మంది ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వానికి మద్దతుగా నిలుస్తారని తెలియజేశారు. ప్రజా సంక్షేమ ధ్యేయంగా పేద ప్రజల ఆర్థిక అభివృద్ధి లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పనిచేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో కాళ్ల, ఆకివీడు, ఉండి జడ్పిటిసి లు పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, వేగేశ్న వెంకటరాజు, రణస్థుల మహంకాళి, ఆకివీడు, కాళ్ల, ఉండి ఎంపీపీలు కటారి జయలక్ష్మి, ఇందుకూరి శ్రీహరి రాజు, పెనుమత్స విశ్వనాథ రాజులతో పాటు కాళ్ల, ఉండి, ఆకివీడు మండలాల పార్టీ కన్వీనర్లు గణేశ్న రాంబాబు, ఆంజనేయరాజు, గుండుగొల్లు ధనరాజు, కోపల్లె కల్వపూడి సొసైటీల అధ్యక్షుడు వేగేశ్న జయరామకృష్ణంరాజు, పెనుమత్స ప్రసాద్ రాజు, పుప్పాల పండు, సిరపు శ్రీనివాస్, వీరమల్లు గంగయ్య, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా ప్రారంభమైన వెంకన్న కల్యాణోత్సవాలు


ప్రత్యేక అలంకరణలో ఉత్సవ విగ్రహాలు

కాళ్ల: మండలంలోని కాళ్లకూరు గ్రామంలో వేంచేసియున్న స్వయంభూ వెంకటేశ్వర స్వామివారి కల్యాణ మహోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా శనివారం సాయంత్రం స్వామివారికి విష్వక్సేన పూజ, మృత్సంగ్రహణ, అంకురార్పణ, ధ్వజారోహణంతో స్వామివారి సప్తాహ్నిక తిరుకల్యాణ మహోత్సవాలు దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షుడు దండు వెంకట కృష్ణంరాజు దంపతులచే ఘనంగా ప్రారంభమయ్యాయి. స్వామివారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ కార్యనిర్వహణాధికారి మోకా అరుణ్ కుమార్ ధర్మకర్తలి మంత్రి సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి పి.సత్యాదేవి

సాక్షి, భీమవరం: మే 13 న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో రాజీకాదగిన కేసులు రాజీ చేసే దిశగా ప్రయత్నించాలని సంబంధిత అధికారులు, న్యాయవాదులను 3వ అదనపు జిల్లా జడ్జి పి.సత్యాదేవి, 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి డి.ధన రాజు సూచించారు. లోక్ అదాలత్ నిర్వహణపై న్యాయమూర్తులు శనివారం వేర్వేరుగా నిర్వహించిన సమావేశాల్లో వారు మాట్లాడారు. మోటార్ వాహన ప్రమాద బీమా కేసులు, శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ కంపెనీ, శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ప్రైవేట్ లిమిటెడ్ కి సంబంధించిన కేసులు రాజీకి ప్రయత్నించాలన్నారు. ప్రమాద బీమా కేసుల్లో సంబంధిత ఇన్సూరెన్స్ కంపెనీల నుంచి పిటిషనర్‌లకు తక్కువ సమయంలో నష్ట పరిహారాన్ని చెల్లించడానికి ఈ జాతీయ లోక్ అదాలత్ ను ఉపయోగించుకోవాలని సూచించారు. లోక్ అదాలత్ ముఖ్య ఉద్దేశ్యాన్ని కక్షిదారులకు అర్థం అయ్యేలా చెప్పాలన్నారు. శ్రీరామ్ సిటీ యూనియన్ కంపెనీకి సంభంధించిన చెక్ బౌన్స్ కేసుల పై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు, న్యాయవాదులకు సూచనలిచ్చారు. ఉభయ కక్షిదారులను సమన్వయ పరిచి తక్కువ సమయంలో సమ న్యాయం పొందేలా న్యాయవాదులు కూడా సహకరించాలన్నారు. రాజీ పడతగిన క్రిమినల్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని, కక్షిదారులకు లోక్ అదాలత్ యొక్క ఉపయోగాలు తెలపాలన్నారు. ఉభయ పార్టీలను సమన్వయ పరిచి ఇరు పక్షాల వారు సమ న్యాయం పొందేలా ప్రయతి్నంచి ఆయా కోర్టుల్లో ఉన్న పెండింగ్ కేసులు తగ్గేలా చూడాలన్నారు. ఈ సమావేశాల్లో న్యాయవాదులు ఎస్. సత్యనారాయణ, టి.వెంకట లక్ష్మి, అజయ్ ఘోష్, రమేశ్, రామకృష్ణం రాజు, ఆర్.రవీంద్ర, బ్యాంక్ మేనేజర్లు, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పాలకోడేరు: భీమవరం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సీనియర్ సివిల్ జడ్జి బి. అప్పల స్వామి అధ్యక్షతన శనివారం పాలకోడేరు మండలం మోగల్లు ఉన్నత పాఠశాల ఆవరణలో రాజీ మార్గమే రాజ మార్గం అనే నినాదంతో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో న్యాయమూర్తి అప్పలస్వామి మాట్లాడుతూ మే 13వ తేదీన భీమవరం ఆయా కోర్టుల్లో నిర్వహిస్తున్న జాతీయ లోక్ అదాలత్ ను పాలకోడేరు మండల పరిధిలో ఉన్న కక్షిదారులు పంతాలకు పోకుండా లోక్ అదాలత్ లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో న్యాయవాదులు పులిదిండి అంబేడ్కర్, చంద్రశేఖర్, విశ్వేశ్వరరావు, ఎస్సై నాళం శ్రీనివాసరావు గ్రామ సర్పంచ్ మల్లిపూడి కృష్ణ కుమారి, ఉప సర్పంచ్ పెన్మత్స సీతారామరాజు, హెడ్ కానిస్టేబుల్ నాగరాజు, వీఆర్వోలు సురేష్, నాగ తులసి, మహిళా పోలీసులు అనూష, పూర్ణిమ, వలంటీర్లు, దొడ్డ విసు, మద్దుల మౌళి తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు మరింత వేగిరపర్చాలి

ఉండి: జగనన్న లేఅవుట్స్‌లో గృహ నిర్మాణాలను మరింత వేగంవంతం చేస్తున్నట్లు ఆర్డీఓ దాసి రాజు అన్నారు. శనివారం ఉండి మండలం వెలివర్రు సమీపంలోని ఎన్నార్పీ అగ్రహారం లేఅవుట్ పూడిక పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం డివిజన్‌లోని అన్ని లేఅవుట్‌ల పూడిక పనులు పూర్తయినట్లేనని తెలిపారు. ఉండి మండలంలోని లేఅవుట్లల్లో ఉండి జడ్పీ హైస్కూల్, చెరుకువాడ, ఎన్నార్పీ అగ్రహారం తదితర ప్రాంతాల్లోని లేఅవుట్‌ల్లో శరవేగంగా ఇళ్ల నిర్మాణం చేపడతామన్నారు. ఇళ్లు కట్టుకోలేని లబ్ధిదారులు అంగీకరించి కట్టమని కోరితే వారికి సుమారు రెండు నెలలలోపుగానే ఇల్లు కట్టి వారికి ఇచ్చేందుకు ఏజన్సీలు సిద్ధంగా ఉన్నాయన్నారు. ప్రస్తుతం జరుగుతున్న పూడికలు పూర్తికాగానే అద్భుతంగా ఇళ్ల నిర్మాణం కూడా పూర్తి చేస్తామన్నారు. డివిజన్‌లో వీరవాసరం, అత్తిలి మండలాల్లోని కొన్ని ప్రాంతాల్లో పూడిక పనులు పూర్తి కావాల్సి ఉందన్నారు. అకివీడు మండలం కుప్పనపూడి లేఅవుట్, భీమవరం అర్బన్, విస్సాకోడేరులో ఇళ్ల నిర్మాణాలు పూర్తి కావస్తున్నాయన్నారు. వీరవాసరం, బాలేపల్లి తలతాడితిప్ప లేఅవుట్స్‌లో కొన్ని ఇబ్బందులు ఉన్నాయన్నారు. అవి పరిష్కారం కాగానే అక్కడ కూడా ఇళ్ల నిర్మాణం వేగవంతంగా పూర్తి చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో హైసింగ్ అధికారులు పీ శివరామరాజు, ఏఈఈ డీ రామ కృష్ణంరాజు, డిప్యూటీ తహసీల్దార్ ఎస్‌వీఎస్ నాయుడు, ఆర్‌ఐ ఆర్ కార్తీక్ పాల్గొన్నారు.

వ్యక్తికి రిమాండ్

వీరవాసరం: వీరవాసరం పోలీసు వారికి వచ్చిన రిపోర్టు ప్రకారం, పాలకోడేరు మండలం శృంగవృక్షం గ్రామానికి చెందిన అవివాహిక స్త్రీకి తనకు వివాహం కాలేదని చెప్పి, పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి మోసగించి ఆమెను గర్భవతి చేసి ,పెండ్లికి నిరాకరించినందున బాధిత స్త్రీ ఇచ్చిన రిపోర్టుపై కేసు నమోదు చేసి, మోసగించిన వ్యక్తిని అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపడం జరిగింది.

మున్సిపల్ స్కూల్లో గ్రాడ్యుయేషన్ డే

సాక్షి, భీమవరం: చిన్ననాటి నుంచే విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యశించాలని మున్సిపల్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం సారిక దుర్గాదేవి అన్నారు. 27వ వార్డులోని రెస్ట్ హౌస్ రోడ్డులోని ఆర్‌హెచ్‌ఆర్ న్యూ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వం ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు విద్యా సౌకర్యాలు, మంచి విద్య అందిస్తుందన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డ్రెస్ కోడ్ ధరింప చేసి షీల్డ్ అందచేశారు. ఈ కార్యక్రమంలో ప్రశాంతి, వరలక్ష్మి, ఎ.హనుమాన్, సీఆర్పీఎస్ నాగలక్ష్మి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆర్‌బీకేల వద్దే ధాన్యం కొనుగోళ్లు

వీరవాసరం: రైతుల వద్ద ఉన్న ధాన్యాలను పూర్తి స్థాయిలో కొనుగోళ్లు చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని వీరవాసరం తహసీల్దార్ ఎం సుందర్ రాజు తెలిపారు. రాయకుదురు ధాన్యం కొనుగోలు కేంద్రం, ఆర్‌బీకేను శనివారం ఆయిన సందర్శించారు. రైతులు దళారిని ఆశ్రయించవద్దని, దళారీలు ఉంటే చీటింగ్ కేసు పెట్టి అరెస్ట్ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఈఓ రవి, వీఆర్వో వెంకట్రావు, రైతు భరోసా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

సామాజిక తనిఖీపై శిక్షణ

ఆకివీడు: పల్లెల్లోని పాఠశాలలో పని తీరు, గోరుముద్దపై అవగాహన, మరుగుదొడ్లు, పరిసరాల పరిశుభ్రత, ప్రహరీగోడలున్నాయాలేదా అనే అంశాలతో పాటు పాఠశాలలో విద్యా ప్రమాణాలు ఏవిధంగా ఉన్నాయి అనే అంశాల్ని పొందుపరుస్తూ ప్రభుత్వం ప్రత్యేక యాప్ తయారు చేసిందని అజ్జమూరు ఎంపీపీ స్కూల్ హెచ్‌ఎం ఆర్వీ.ఎస్.నారాయణ శనివారం శిక్షణ ఇచ్చారు. శిక్షణా కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, తల్లిదండ్రుల కమిటీ హాజరైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో విద్యా ప్రమాణాల మెరుగుకు ప్రభుత్వం యాప్ రూపొందించిందన్నారు. విద్యార్థులు పుస్తకాలు చదివే విధంగా ప్రభుత్వం ఉచితంగా పుస్తకాలు పంపిణీ చేస్తోందని చెప్పారు. పుస్తకాల్ని విద్యార్థులకు అందజేశారు.

ఘనంగా గ్రామోత్సవం

ఉండి: మండలంలోని సంతమార్కెట్‌లో వేంచేసియున్న పోలేరమ్మ, వెంకమ్మ, మహంకాళమ్మ, పోతురాజు ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న జాతర మహోత్సవాల్లో శనివారం రాత్రి గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గరగ నృత్యాలు, తీన్‌మార్, మందుగుండు, విచిత్ర వేషధారణలతో అమ్మవార్లు, స్వామివారికి ఊరేగింపు నిర్వహించారు.ఈ సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున స్వాగతం పలికి దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



భీమవరం ఫేమస్ ఇన్ ఆక్వాకల్చర్ స్పెషల్

ADVT SPECIAL FEATURE











